టీజీఐఐసీ నిర్లక్ష్యంతో అమాయకులు బలి!

- పరిశ్రమలకు సేకరించిన భూములను విక్రయిస్తున్న పట్టాదార్లు
- పరిహారం చెల్లించినా తమపేర రిజిస్ట్రేషన్ చేయించుకోని టీజీఐఐసీ
- రికార్డుల్లో ఇంకా పట్టాదార్ల పేర్లు.. మోసపోతున్న ప్రజలు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఐఐసీ) నిర్లక్ష్యం కొందరు అమాయకులకు శాపంగా మారుతున్నది. ఏండ్ల క్రితం పరిశ్రమల కోసం సేకరించిన భూములను కూడా టీజీఐఐసీ తన పేర మ్యుటేషన్ చేయించుకోకపోవటంతో నష్టపరిహారం తీసుకున్న పట్టాదార్లు తమ భూములను అమాయకులకు అంటగడుతున్నారు. భూములు కొనుగోలు చేసినవారు వాస్తవం తెలిసిన తర్వాత లబోదిబోమంటున్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు లెక్కలేనన్ని ఉండొచ్చని అధికారులే అంగీకరిస్తున్నారు. పారిశ్రామిక అవసరాల కోసం రైతుల నుంచి భూములు సేకరించి, మౌలిక సదుపాయాలు కల్పించిన అనంతరం పరిశ్రమలకు విక్రయించడం టీజీఐఐసీ బాధ్యత. రైతుల నుంచి సేకరించిన భూములను నష్టపరిహారం చెల్లించిన వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇలా చేయడంవల్ల పట్టాదార్లు ఇతరులకు విక్రయించే అవకాశం ఉండదు. అయితే టీజీఐఐసీకి చెందిన అధికారుల నిర్లక్ష్యం వల్ల చాలా ప్రాంతాల్లో సేకరించిన భూములు ఇంకా పట్టాదార్ల పేర్లతోనే కొనసాగుతుండటంతో వారు క్రయవిక్రయాలు జరుపుతున్నారు. దీనివల్ల కొనుగోలు చేస్తున్న అమాయకులు మోసపోతున్నారు. ఉదాహరణకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలో వివిధ సర్వే నంబర్లలో దాదాపు 20 ఏండ్ల క్రితం అప్పటి ఏపీఐఐసీ సుమారు 200 ఎకరాల భూములు సేకరించింది. అందులో పావువంతు భూముల్లోనే పరిశ్రమలు ఏర్పాటు కాగా, మిగిలిన భూములు ఖాళీగానే ఉన్నాయి. భూములు సేకరించినా వాటిని పరిశ్రమల పేరుతో గానీ, ఏపీఐఐసీ పేరుతోగానీ రిజిస్ట్రేషన్ చేయించలేదు. దీంతో ఇంకా ఆ భూములు పట్టాదార్ల పేరు మీదే ఉన్నట్టు రికార్డులు చెప్తున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు వాటిని మళ్లీ ఇతరులకు విక్రయించారు.

చేతులెత్తేసిన టీజీఐఐసీ

సర్వే నంబరు 81 పరిధిలో ఇటువంటి ఘటన ఒకటి తాజాగా వెలుగు చూసింది. 20 ఏండ్ల క్రితం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో ఆరు ఎకరాల భూమి ఇప్పటికే నలుగురు చేతులు మారింది. తీరా ఐదో వ్యక్తి దాన్ని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా, టీజీఐఐసీ పేర రిజిస్టర్ అయినట్టు రికార్డులు చూపుతున్నాయి. దీంతో విక్రయానికి ఉంచిన ఆ నాలుగో వ్యక్తి తాను మోసపోయానని లబోదిబోమంటున్నాడు. తాను పట్టాదారు వద్ద భూమి కొనుగోలు చేసినట్టు, తన భూమిని విక్రయించేందుకు ఎన్వోసీ ఇవ్వాలని బాధితుడు టీజీఐఐసీని వేడుకొంటున్నాడు. అధికారులు మాత్రం ఎన్వోసీ ఇచ్చే ఆస్కారం లేదని చేతులెత్తేశారు. ఆ 200 ఎకరాల భూముల్లో ఇలాంటి ఇంకా ఎన్ని ఉన్నాయో తేలాల్సి ఉన్నది.

స్థానికంగా విచారించుకొని కొనుగోలు చేయాలి: టీజీఐఐసీ

పారిశ్రామిక ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేయాలనుకొనేవారు సమగ్రంగా విచారించుకొని, స్థానికులతో మాట్లాడిన తర్వాతే భూములు కొనుగోలు చేయాలని టీజీఐఐసీ అధికారులు సూచిస్తున్నారు. సిబ్బంది కొరత వల్ల తాము సేకరిస్తున్న భూములను వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోతున్నామని, దీన్ని ఆసరాగా చేసుకొని పట్టాదార్లు నష్టపరిహారం తీసుకొని కూడా ఇతరులకు విక్రయించుకొంటున్నట్టు తెలిసిందని చెప్తున్నారు. సేకరించిన భూములను టీజీఐఐసీ పేర మ్యూటేషన్ చేయాల్సిన బాధ్యత రెవెన్యూశాఖపై ఉంటుందని, వాళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తాము చేసేదేమీ లేదని స్పష్టంచేస్తున్నారు. మొత్తంగా అధికారుల నిర్లక్ష్యం వల్ల అమాయకులు ఎంతోమంది మోసపోతున్నారు.

అమూల్ టర్నోవర్ 59,445 కోట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: అమూల్ పేరుతో పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్(జీసీఎంఎంఎఫ్) అంచనాలకు మించి రాణిస్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.59,445 కోట్ల(7 బిలియన్ డాలర్లు) ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది వచ్చిన ఆదాయంతో పోలిస్తే ఎనిమిది శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్లు 50వ వార్షిక సాధారణ సర్వసభ్య సమావేశం అనంతరం వెల్లడించింది. అలాగే గ్రూపు టర్నోవర్ రూ.80 వేల కోట్లు(10 బిలియన్ డాలర్లు)గా నమోదైందని తెలిపింది. 2022-23 ఏడాదికిగాను 72 వేల కోట్లు(9 బిలియన్ డాలర్లు) ఆర్జించింది. ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార బ్రాండ్, బలమైన పాల ఉత్పత్తుల బ్రాండ్‌గా అమూల్ ఎదిగింది. రైతులే యజమానినిగా ఎదిగిన అమూల్ కో-ఆపరేటివ్ సొసైటీలో 36 లక్షల మంది రైతుల నుంచి రోజుకు 300 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నది. ఈ సందర్భంగా జీసీఎంఎంఎఫ్ చైర్మన్ శామల్‌భాయ్ పటేల్ మాట్లాడుతూ..జీసీఎంఎంఎఫ్ మరో చారిత్రక మైలురాయికి చేరుకున్నదని, ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార పదార్థాల బ్రాండ్‌గా అవతరించిందన్నారు.

బీఎస్ఎన్ఎల్ సరికొత్త ప్లాన్

60 రోజుల వ్యాలిడిటీతో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ మరో ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 60 రోజుల కాలపరిమితితో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్‌ను తెచ్చింది. ఈ ప్లాన్ కింద రోజుకు 1జీబీ డాటాతోపాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. 4జీ సేవలు అందించడానికి సిద్ధమతున్న సంస్థకు ఈ నూతన ప్లాన్‌తో కస్టమర్లకు అధిక ప్రయోజనాలు లభించనున్నాయని తెలిపింది. ఇతర టెలికం సంస్థల కంటే బీఎస్ఎన్ఎల్ టారిఫ్‌లు చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఇరు సంస్థల బోర్డులు ఆమోదం తెలిపాయి. ఈ విలీనం అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నది. ఈ విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, చెన్నై బెంచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ వాటాదారులకు రూ.10 ముఖ విలువ కలిగిన 100 ఈక్విటీ షేర్లకుగాను ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌నకు చెందిన 155 ఈక్విటీ షేర్లు లభించనున్నాయి.

నూతన కార్ల సందడే..సందడి

వచ్చే నెలలో విడుదలకానున్న ఐదు మాడళ్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రస్తుత పండుగ సీజన్‌లో కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ఆటోమొబైల్ సంస్థలు సరికొత్త మాడళ్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నాయి. ఇప్పటికే ప్రతి నెలలో అర డజన్‌కు పైగా మాడళ్లను విడుదల చేస్తున్న సంస్థలు..వచ్చే నెలలోనూ ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తూ ఐదు మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాయి. వీటిలో కియా, నిస్సాన్, బీవైడీ, మెర్సిడెజ్ బెంజ్‌లు ఉన్నాయి. ఈ వివరాలు..

కియా నుంచి రెండు మాడళ్లు

కొరియాకు చెందిన వాహన సంస్థ కియా.. దేశీయ మార్కెట్లోకి నయా కార్నివాల్‌ను విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 3న మార్కెట్లోకి విడుదల చేస్తున్న ఈ కారు ధర రూ.50 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. 2.2 లీటర్ 4-సిలిండర్ డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ కారు 193 బీహెచ్‌పీల శక్తినివ్వనున్నది. దీంతోపాటు మరో ఈవీ మాడల్‌ను కూడా అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 99.8 కిలోవాట్ల బ్యాటరీతో తయారు చేసిన ఈవీ 9లో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 561 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. కేవలం 24 నిమిషాల్లోనే 10 శాతం నుంచి 80 శాతం వరకు చార్జింగ్‌కానున్నది.

నిస్సాన్ మ్యాగ్నైట్ ఫేసిలిఫ్ట్

వచ్చే నెల 4న మ్యాగ్నైట్ ఫేసిలిఫ్ట్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది నిస్సాన్ ఇండియా. దేశీయ మార్కెట్‌తోపాటు ఇతర దేశాలకు అనుగుణంగా లెఫ్ట్-హ్యాండ్ డ్రైవ్ వెర్షన్ కూడా తీసుకురాబోతున్నది.

బీవైడీ ఈమ్యాక్స్ 7

చైనాకు చెందిన ఈవీల తయారీ సంస్థ బీవైడీ మరో మాడల్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 8న ఈమ్యాక్స్ 7 మాడల్‌ను అందుబాటులోకి తెస్తున్నది. అడాస్ సూట్, ప్రీమియం స్విచ్ గేర్, సాఫ్ట్-టచ్ మెటీరియల్స్, లగ్జరీ లుక్‌తో తీర్చిదిద్దింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారులో 55.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 420 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ఇవ్వనున్నది.

మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్

జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్ ఎల్‌డబ్ల్యూబీ మాడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 14.4 ఇంచుల సెంట్రల్ టచ్‌స్క్రీన్‌తోపాటు 12.3 ఇంచుల ప్యాసింజర్ టచ్‌స్క్రీన్, 4డీ సరౌండింగ్ సౌండ్ సిస్టమ్ కలిగిన ఈ మాడల్‌ను 2.0 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో తయారు చేసింది.

ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ ఆఫర్లు

ముంబై, సెప్టెంబర్ 28: ఇటీవల మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నది. ఐఫోన్ 16ని కొనుగోలు చేసినవారికి రూ.5 వేల ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్ అందుకోవచ్చునని తెలిపింది. అలాగే ఈఎంఐ ఆప్షన్‌లో నెలకు రూ.2,497 చెల్లించి ఈ ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చునని సూచించింది. ఈ ఆఫర్లు డిసెంబర్ 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయని పేర్కొంది. పాత ఐఫోన్ కలిగివున్నవారు అప్‌గ్రేడ్‌తో ఐఫోన్ 16ని కొనుగోలు చేసిన వారికి క్యాష్‌బ్యాక్‌తోపాటు వడ్డీ రహిత ఈఎంఐని ఎంచుకోవచ్చునని సూచించింది. ఈ ఆఫర్ కేవలం ఐఫోన్ 16 ప్రొ మ్యాక్స్, ఐఫోన్ 16 ప్రొ, ఐఫోన్ 16 ప్లస్, ఐఫోన్ 16 మాడళ్లకు వర్తించనున్నది. ఈ-కామర్స్ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లతోపాటు ఆఫ్‌లైన్ స్టోర్లు అప్‌ట్రానిక్స్, యూనికార్న్, క్రోమా, రిలయన్స్, విజయ సేల్స్, సంగీత మొబైల్స్‌లో లభించనున్నది.

రియల్టీ సంస్థలపై రెరా కొరడా

వెయ్యికిపైగా ప్రాజెక్టులపై రూ.35 కోట్ల జరిమానా

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ సంస్థలపై రెరా కొరడా ఝుళిపించింది. మార్కెటింగ్ కార్యకలాపాలు, ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో జరుగుతున్న మోసాలపై ఉక్కుపాదం మోపడానికి రెరా పలు కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పూర్తిస్థాయిలో రెరా ఏర్పాటైన గడిచిన ఏడేండ్లలో ఏకంగా వెయ్యికి పైగా ప్రాజెక్టులపై రూ.36 కోట్ల వరకు జరిమానా విధించింది. వీటిలో ఇప్పటికే రూ.15 కోట్లను ఆయా సంస్థలు చెల్లించాయి కూడా. ఎనిమిది కంటే ఎక్కువ ప్లాట్లను విక్రయించిన, 600 గజాలు అంతకంటే ఎక్కువ స్థలంలో నిర్మించి విక్రయాలు చేసినా ప్రాజెక్టులు రెరా పరిధిలోకి వస్తాయి. ఇలాంటి సంస్థలు తప్పకుండా రెరా వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ రెరా వద్ద నమోదు చేసుకోకుండానే విక్రయాలు జరిపితే ఆయా ప్రాజెక్టులు చేపట్టిన సంస్థలపై ఈ మండలి భారీస్థాయిలో జరిమానా విధిస్తున్నది.

రెరా ఏర్పాటైన తరువాత వివిధ ప్రాజెక్టులకు విధించిన జరిమానాలు

సంవత్సరం	ఫైన్ వేసిన ప్రాజెక్టులు	జరిమానా మొత్తం (రూ.కోట్లలో)
2018-19	335	3.06
2019-20	49	0.79
2020-21	04	0.29
2021-22	03	0.23
2022-23	180	1.70
2023-24	311	26.69
2024-25	131	2.96
మొత్తం	1013	35.72

రెరా నంబర్ లేకుండానే ప్రకటనలు..

రెరా నంబర్ లేకుండానే రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ స్థాయిలో వాణిజ్య ప్రకటనలు జారీ చేసిన సంస్థలపై ఫిర్యాదులు అందడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వాణిజ్య ప్రకటనలపై ఖచ్చితంగా రెరా నంబర్ ఉండాల్సిందేనని షరతు విధించింది. దీంతో తమ ప్రకటనల పక్కన రెరా నంబర్‌ను ఖచ్చితంగా ముద్రిస్తున్నాయి. ప్రీలాంచ్ ఆఫర్లు, ముందస్తుగా ఒప్పందం చేసుకున్న మేరకు ప్లాట్లను అప్పగించకపోవడం, వాటిలో సరైన వసతులు కల్పించకపోయిన ప్రాజెక్టులపై కూడా చర్యలు తీసుకున్నది. ఒక దగ్గర ప్రాజెక్టు నమోదు చేసుకొని..అదే అనుమతితో మరి కొన్ని చోట్ల విక్రయాలు చేస్తున్న ప్రాజెక్టులను గుర్తించడానికి ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

గెలుపొందిన క్రీడాకారులతో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల, సెప్టెంబర్ 28: నేటి సమాజంలో చదువుతోపాటు క్రీడలు అవసరం అని.. క్రీడాకారులకు తమవంతు ప్రోత్సాహం తప్పనిసరిగా ఉంటుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలో జగిత్యాల జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడారంగ అభివృద్ధికి సీఎం సానుకూలంగా ఉన్నారని చెప్పారు. క్రీడలతో స్నేహభావం, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఇక్కడ కౌన్సిలర్ చుక్క నవీ న్, యువజన క్రీడల నాయకులు సీతారాం నాయక్, పెటా అధ్యక్షుడు పడా ల విశ్వప్రసాద్, నాయకులు అడువాల లక్ష్మణ్, చెట్‌పల్లి సుధాకర్, జక్కుల చంద్రశేఖర్, పీఈటీలు, క్రీడాకారులు, నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 28: జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా కొంక వేణు, ఉపాధ్యక్షుడిగా మాదూరి రమేశ్, కార్యదర్శిగా ఇమ్రాన్‌ఖాన్, సంయుక్త కార్యదర్శిగా జిందం రాజేశ్, కోశాధికారిగా కేశెట్టి తిరుపతి, మహిళా కార్యదర్శిగా గుండేటి శ్రీవాణి, రాష్ట్ర కమిటీ సభ్యులుగా కొక్కుల గంగాధర్, చిలుకమారి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ఇంటర్ విద్యాధికారి డాక్టర్ కే వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరుకాగా, ఎన్నికల అధికారిగా వై రమేశ్‌బాబు, పరిశీలకులుగా ఏ సంజీవ్, డీ నాగభూషణం వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని ప్రిన్సిపాల్స్, జిల్లా లైబ్రేరియన్ సంఘం అధ్యక్షుడు సంపత్ అభినందించారు.

₹2లక్షల రుణమాఫీ చేసేవరకు ఉద్యమిద్దాం

కథలాపూర్, సెప్టెంబర్ 28: అర్హులైన రైతులకు ₹2లక్షల రుణమాఫీ వచ్చేవరకు ఉద్యమిద్దామని రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సిరికొండ, కథలాపూర్, భూషణరావుపేట, చింతకుంట, పోసానిపేట, తాండ్ర్యాల గ్రామాల్లో పర్యటించి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎకరానికి ₹15వేల రైతుభరోసా విడుదల చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 4న చేపట్టే చలో కలెక్టరేట్ ముట్టడికి రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఇక్కడ నాయకులు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, నాగం భూమయ్య, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, తురుగా శ్రీధర్ రెడ్డి, నారాయణ, సంజీవ్‌రెడ్డి, గంగారెడ్డి, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి

పట్టణాభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మారుతీనగర్, సెప్టెంబర్ 28: పట్టణాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సూచించారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో మిషన్ భగీరథ కొత్త కనెక్షన్లు ఇవ్వాలని, రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని, వీధికుక్కల బెడదను నిర్మూలించాలని, బస్ డిపో వద్ద హైమాస్ట్ లైట్లు మరమ్మత్తులు చేయాలని, చెన్నకేశవాలయ నూతన కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం 22అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ఇక్కడ పాలకవర్గ సభ్యులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 28: పైడిమడుగు గ్రామంలో బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుల నిధుల నుంచి రూ.15లక్షలతో చేపట్టే రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల స్థానిక నాయకులతో కలిసి శనివారం భూమిపూజ చేశారు. అలాగే గ్రామంలో మ్యాకల ఆశన్న ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించి.. రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఐలాపూర్‌లో మాజీ ఎంపీపీ తాటికొండ విష్ణు భార్య ఇటీవల మృతి చెందగా, పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, ఆర్‌బీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకట్రావ్, పీఏసీఎస్ చైర్మన్ అయిల్‌నేని జగన్‌మోహన్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తురగ సంజీవరెడ్డి, నాయకులు పిడుగు సందయ్య, గట్ల అనంతస్వామి, గడిగొప్పుల గోపాల్, తుక్కారాం, తదితరులు పాల్గొన్నారు.

మారుతీనగర్: సమావేశంలో మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్‌కు ఎంపిక

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 28: జిల్లా కేంద్రంలోని టీచర్స్ భవన్‌లో జిల్లా స్థాయి డ్రామా ఫెస్టివల్ పోటీలను నిర్వహించినట్లు జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ నీటి సంక్షోభం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, విపత్తు నిర్వహణ కోసం ఆధునిక సాంకేతికలు, ఆరోగ్యం పరిశుభ్రత అనే అంశాలలో పోటీలు నిర్వహించగా జిల్లాలోని 17 పాఠశాలలు పాల్గొన్నట్లు తెలిపారు. పెగడపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రపంచ నీటి సంక్షోభంపై చేపట్టిన ప్రదర్శనకు మొదటి స్థానం, జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్ విద్యార్థుల ప్రదర్శన రెండవ స్థానంలో నిలిచినట్లు ఆయన తెలిపారు. ఈ రెండు ప్రదర్శనలు రాష్ట్ర స్థాయిలో అక్టోబర్ 17, 18 తేదీల్లో జరిగే సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు ఎలిగేటి రాజేంద్రప్రసాద్, సతీశ్, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

పౌర సేవలు పకడ్బందీగా అమలు చేయాలి

పెగడపల్లి: కంపోస్ట్‌షెడ్డును పరిశీలిస్తున్న జాయింట్ కమిషనర్

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబర్ 28: పౌర సేవలను పంచాయతీ అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివా రం మెట్‌పల్లి మండలం చౌలమద్ది, వెల్లుల్ల గ్రామ పంచాయతీ ల్లో అమలు చేస్తున్న పౌర సేవలను పరిశీలించారు. సక్రమంగా గ్రామసభలు నిర్వహిస్తున్నారా? పారిశుద్ధ్యం, నీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ, క్లోరినేషన్ సక్రమంగా జరుగుతున్నాయా? లేదా? అని తెలుసుకున్నారు. విషజ్వరాలు, వాటి నివారణకు తీ సుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. పౌరులకు సేవలందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. ఇక్కడ డీఆర్డీవో రఘువరన్, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, సెర్ప్ ఏపీఎం విమోచన, జీపీ కార్యదర్శులు నారాయణ, రవి ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

పెగడపల్లి, సెప్టెంబర్ 28: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పంచాయతీ రాజ్ రాష్ట్ర జాయింట్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. నేషనల్ పంచాయతీ అవార్డుకు శాలపల్లి ఎంపిక కానున్న నేపథ్యంలో శనివారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. ఇక్కడ డీపీవో రఘువరన్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, సెర్ప్ ఏపీఎం సమత, ఏపీవో అనిల్, కార్యదర్శి తిరుపతి, మాజీ సర్పంచ్ తార-శంకరయ్య ఉన్నారు.

'చలో కలెక్టరేట్' విజయవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 28: అక్టోబర్ 4న చేపట్టే చలో కలెక్టరేట్ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర రైతు నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని గురుడికాపు సంఘ భవనంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతుల్లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. వానకాలం సీజన్ ముగుస్తున్నందన వెంటనే రైతుభరోసా అందించాలని, అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని కోరారు. ఇక్కడ రైతు నేతలు ఏలేటి చిన్నారెడ్డి, నేమూరి సత్యనారాయణ, తీగల శ్రీధర్‌రెడ్డి, ఏలాల దశరథ్‌రెడ్డి, నాం పెల్లి రమేశ్, తీగల రవీందర్‌రెడ్డి, పడాల అనిల్, బద్ధం గోపి, రెబ్బటి రాజేందర్, సుం కెం రాజశేఖర్, పడాల రాజేందర్, జిల్లాల పవన్, సరసం ప్రసాద్‌రెడ్డి, బద్ధం రాజేశ్వర్‌రెడ్డి, మారుపాక రమేశ్, మహేందర్ ఉన్నారు.

మెట్‌పల్లిలో నేషనల్ లోక్ అదాలత్

మారుతీనగర్, సెప్టెంబర్ 28: మెట్‌పల్లి మున్సిఫ్ కోర్టులో న్యాయవిజ్ఞాన సదస్సు ఆధ్వర్యంలో శనివారం నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిమినల్ కేసులు 61, ఎంసీడీవీసీ కేసులు 7, చెక్‌బౌన్స్ కేసులు 4, పీఎల్‌సీ బ్యాంకుకు సంబంధించిన 42కేసులు, సివిల్ కేసులు 8, డ్రంకెన్‌డ్రైవ్ 316 కేసులు పరిష్కరించనట్లు న్యాయమూర్తి అరుణ్‌కుమార్ వివరించారు. ఇక్కడ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింబాద్రి, ఉపాధ్యక్షులు రాంబాబు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, లోక్ అదాలత్ సభ్యులు వెంకటస్వామి, శంకర్‌రెడ్డి ఉన్నారు.

బాలసదన్ నుంచి బాలిక మిస్సింగ్

జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 28: జిల్లా కేంద్రంలోని బాలసదన్ నుంచి బాలిక(17) తప్పిపోయిందని జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన ఓ బాలిక నాలుగేండ్ల నుంచి బాలసదన్‌లో ఆశ్రయం పొందుతుందని, శుక్రవారం సాయంత్రం ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదన్నారు. బాలసదన్ నిర్వాహకురాలి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు వెంటనే జగిత్యాల టౌన్ పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

సీజ్ చేసిన గంజాయిని తగులబెడుతున్న పోలీసులు

సీజ్ చేసిన గంజాయి కాల్చివేత

జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 28: జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సీజ్ చేసిన 106.6కిలోల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేసినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా డ్రగ్ డిస్పోజల్ కమిటీ జిల్లా చైర్మన్, ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో గంజాయికి సంబంధించి 43కేసులు నమోదు కాగా, నిందితుల నుంచి ₹25లక్షల విలువైన 106.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు అనుగుణంగా శనివారం కాల్చివేశామన్నారు. మత్తు పదార్థాల నిర్మూలన కోసం పోలీస్‌శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఇక్కడ డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యులు ఏఎస్పీ భీంరావు, ఎస్‌బీ డీఎస్పీ రవీంద్రకుమార్, ఆర్ఐ కిరణ్ కుమార్, జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సీఐలు రాంనర్సింహారెడ్డి, రవి, కృష్ణారెడ్డి, సురేశ్‌బాబు ఉన్నారు.

ఆరోపణలు అవాస్తవం

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పెగడపల్లి, సెప్టెంబర్ 28: ప్రాథమిక సహకార సంఘంలో అవినీతి జరిగిందంటూ కొందరు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని మండల బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నష్టాల్లో ఉన్న సహకార సంఘాన్ని గత పదేండ్లలో చైర్మన్ ఓరుగంటి రమణారావు, పాలకవర్గం కోట్లాది రూపాయలతో లాభాల్లోకి తీసుకువచ్చిందని తెలిపారు. అలాంటిది సంఘంలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సంఘానికి సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనుల ఎంబీ రికార్డు చేయకపోవడంతో ఆడిట్‌లో నిధుల్లో తేడా వచ్చిందని, దీనికే అవినీతి జరిగిందని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇక్కడ సంఘం డైరెక్టర్లు ప్రవీణ్‌రావు, హరిలాల్‌నాయక్, శ్రీనివాస్, ఎల్లయ్య, శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు సత్తయ్య, కరుణాకర్‌రావు, స్వామి, తిరుపతినాయక్, లక్ష్మణ్, తిరుపతి, తిరుపతిరెడ్డి, సంజీవరెడ్డి, నరేశ్, సంతోష్, అరుణ్, మొగిలి, నవీన్ తదితరులు ఉన్నారు.

చికిత్సపొందుతూ కౌలు రైతు మృతి

పెగడపల్లి, సెప్టెంబర్ 28: దేవికొండ గ్రామంలో విద్యుదాఘాతానికి గురై దవాఖాలో చికిత్సపొందుతూ శనివారం కౌలు రైతు తూడూరి భూమయ్య(60) మృతిచెందాడు. ఎస్ఐ రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. భూమయ్య గ్రామ సమీపంలో ఓ రైతుకు చెందిన భూమిని కౌలుకు తీసుకుని కంది సాగు చేశారు. అడవి పందుల నుంచి పంటలను రక్షించేందుకుగానూ చేను చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేశాడు. ఈ నెల 11న తెల్లవారు జామున విద్యుత్ తీగలను తీసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు తీగలకు షాక్‌రావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. భూమయ్య కొడుకు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.